పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

మద్దిరాల, జనవరి 18: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ కోటాచలం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించి మందుల స్టాక్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై పీహెచ్‌సీ వైద్యాధికారి అమూల్యకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శాశ్వత భవన నిర్మాణ కోసం కేటాయించబడిన స్థలాన్ని తాసీల్దార్ అమీన్ సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పేషెంట్‌తో మాట్లాడి వైద్య సేవల వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి

- జిల్లా ప్రత్యేకాధికారి భీమ్‌సింగ్

తిరుమలగిరి, జనవరి 18: మండల కేంద్రం తిరుమలగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ప్రత్యేకాధికారి ఎల్.భీమ్‌సింగ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 90 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసి ఇంటర్ పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని అధ్యాపకులకు సూచించారు. కళాశాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని, వచ్చే ఏడాది విద్యార్థుల సంఖ్యను పెంచేలా పనిచేయాలని కోరారు.

చోరీ కేసులో వ్యక్తికి రిమాండ్

కేతేపల్లి, జనవరి 18 : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకొని పోలీసులు శనివారం రిమాండ్‌కు పంపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఇనుపాముల ఆవాస గ్రామమైన రాయపురం గ్రామానికి చెందిన చినబత్తిని లూర్థుమేరి గత నెల 31వ తేదీన ఉదయం 9 గంటల సమయంలో తన ఇంటికి తాళం వేసి విధుల నిమిత్తం స్కూల్‌కు వెళ్లింది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, కొంత నగదును ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులకు ఈనెల 8న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతంపల్లి గ్రామానికి చెందిన గంటా రామారావు అనే వ్యక్తి అనుమానాస్పదంగా పట్టుబడ్డాడు. నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి 13 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసి, పీటీ వారెంట్‌పై అరెస్టు చేసి నకిరేకల్ కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ పేర్కొన్నారు.

న్యాయసేవా యూనిట్ సభ్యుల నియామకం

హుజూర్‌నగర్, జనవరి 18: జిల్లాస్థాయిలో బాలలు, మానసిక దివ్యాంగులైన బాలల హక్కుల పరిరక్షణ కోసం వేర్వేరుగా రెండు జిల్లాస్థాయి న్యాయసేవా యూనిట్లను నియమిస్తూ శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సింగిరెడ్డి గోవర్ధన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి అధ్యక్షతన పని చేయనున్న ఈ రెండు యూనిట్లలో హుజూర్‌నగర్ న్యాయస్థానాల నుంచి న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, ఎంఎస్ రాఘవరావు, పారాలీగల్ వలంటీర్లు ఖాసీం, అమల, లక్ష్మయ్య, సాయమ్మను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

ఇసుక లారీల పట్టివేత

చింతలపాలెం, జనవరి 18: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి తెలంగాణ ప్రాంతానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను సిబ్బందితో కలిసి ఎస్ఐ అంతిరెడ్డి పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గయ్యపేట నుంచి తెలంగాణలోని మేళ్లచెర్వు, హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో దొండపాడు గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి ఎస్ఐ అంతిరెడ్డి కాపుకాశారు. రెండు లారీలలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నారు. లారీలను స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టుబడిన ఇసుక లారీతో ఎస్ఐ అంతిరెడ్డి, సిబ్బంది

శ్మశాన వాటికకు స్థల పరిశీలన

చింతలపాలెం, జనవరి 18: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీవాసుల వినతి మేరకు శ్మశానవాటిక ఏర్పాటుకు హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

'నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి'

గరిడేపల్లి, జనవరి 18: నిరుపేదలకు మొదటి విడతలోనే ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం సీపీఐ ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, కుందూరు వెంకటరెడ్డి, గోదముల ఈశ్వరాచారి, పంగ సైదులు, కందుల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, SAPAVATH SIRISHA, D/o. Sapavath Buchya, R/o. Mangya Thanda, H/o. Komatipally Village, Devarakonda Mandal, Nalgonda Dist. T.S, I have changed my name as NENAVATH SIRISHA, W/o. NENAVATH SURESH (New Name).

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

శాలిగౌరారం, జనవరి 18 : సాగుకు యోగ్యం కాని భూమి వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని వల్లాల గ్రామంలో రైతు భరోసా కోసం చేపడుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సౌమ్యశృతి, ఏఈఓ శ్రవణ్, అధికారులు ఉన్నారు.

శాలిగౌరారం : వల్లాలలో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

కట్టంగూర్ : మండలంలో అన్ని గ్రామాల్లో శనివారం వ్యవసాయ అధికారులు రైతు భరోసా సర్వేను క్షేత్రస్థాయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ గుగులోతు ప్రసాద్ సర్వేను పరిశీలించి మాట్లాడారు. సర్వే మూడో రోజు అయిటిపాములో 35ఎకరాలు, ఈదులూరులో 58.28, ఇస్మాయిల్‌పల్లిలో 5ఎకరాలు, పిట్టంపలిలో 27, చెర్వుఅన్నారంలో3.06, మునుకుంట్లలో51.33, పామనుగుండ్లలో 33, ఎరసానిగూడెంలో 9.29, కట్టంగూర్‌లో 30.09,దుగినవెల్లిలో 5.07, రామచంద్రపురంలో11.16, కురుమర్తిలో 53.32 మొత్తం 315.37 ఎకరాల యోగ్యం కాని భూములను గుర్తించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి గిరిప్రసాద్, ఏఈఓ పరుశరాములు, భాగ్య, రవి, ఊర్మిళ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్ : మండలం పరిధిలోని వెంకటాద్రిపాలెం, యాద్గార్‌పల్లి, గోగువారిగూడెం, కాల్వపల్లి గ్రామల్లో సిబ్బంది చేపట్టిన సర్వేను మండల ప్రత్యేకాధికారి, అగ్రికల్చర్ ఏడీఏ దేవిసింగ్ పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఏఓ ధీరావత్ సైదానాయక్, ఏఈఓలు షఫీ, రమ్య, అఫ్రిన్, గోపి, రమేశ్, ఆర్ఐ రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని ఖుదాభక్షిపల్లి, సరంపేట, కొట్టాల, కొండూరు, బట్లపల్లి గ్రామాల్లో తాసీల్దార్ బక్క శ్రీనివాసులు ఆధ్వర్యంలో వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన నాగార్జున

నల్లగొండ, జనవరి 18 : బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును తన జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున శనివారం కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని కేసీఆర్ సూచించినట్లు నాగార్జున తెలిపారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

శాలిగౌరారం, జనవరి 18 : ఈనెల 21న నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే రైతు మహా ధర్నా కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో నేడు ఆదివారం మండల కేంద్రంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ తెలిపారు.

కేజీబీవీలో కుక్ పోస్టుకు దరఖాస్తులు

శాలిగౌరారం, జనవరి 18 : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వంట మనిషి(కుక్)పోస్టు ఖాళీగా ఉన్నందున అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ మందుల సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులై ఉండి 18 నుంచి 45సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని సూచించారు. ఈ నెల 20, 21 తేదీల్లో సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు ఎస్ఓకు అందించాలని ప్రకటనలో కోరారు.

నైట్ వాచ్‌ఉమెన్ పోస్టుకు..

గుర్రంపోడు, జనవరి 18 : మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌ఉమెన్ పోస్టుకు అర్హత గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ నోముల యాదగిరి శనివారం ఒక ప్రకటనలో కోరారు. 18 నుంచి 40 ఏండ్ల వయస్సు, పదో తరగతి ఉత్తీర్ణత, స్థానికులై ఉండి సెక్యూరిటీలో అనుభవం గల మహిళా అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోగా మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కొండమల్లేపల్లి, జనవరి 19 : మండల పరిధిలో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. దేవరకొండ పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన బన్నీ తన స్నేహితుడు రాకేశ్‌ను పీఏపల్లి మండంలోని మునావత్‌తండాలో దింపడానికి దేవరకొండ నుంచి బైక్‌పై బయల్దేరాడు. కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలో గల హోటల్ వద్దకు రాగానే నాగార్జున సాగర్ నుంచి వస్తున్న కోళ్ల ఫారం వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బన్నీ, రాజేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108లో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం బన్నీని హైదరాబాద్‌కు తరలించినట్లు బంధువులు పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రామ్మూర్తి పేర్కొన్నారు.

ఏఎమ్మార్పీ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

గుర్రంపోడు, జనవరి 18 : మండలంలోని వద్దిరెడ్డిగూడెం గ్రామ సమీపంలో గల ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలో శనివారం గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభించినట్లు కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ, ఎస్ఐ మధు తెలిపారు. కాల్వ కంపచెట్లకు తగిలి తేలుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా బయటకు తీసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. వయస్సు 40 సంవత్సరాల పైబడి ఉండొచ్చని ఆచూకీ తెలిసిన వారు 87126 70157, 87126 70228 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఫిలిప్పిన్స్ దేశానికి తెలంగాణ బియ్యం

హాలియా, జనవరి 18 : తెలంగాణ ప్రభుత్వం లక్ష టన్నుల బియ్యాన్ని ఫిలిప్పిన్స్ దేశానికి ఎగుమతి చేసేందుకు గానూ ఆ దేశ ప్రభుత్వంతో ఒప్పం దం చేసుకున్న నేపథ్యం లో శనివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులతో కలసి ఫిలిప్పిన్స్ దేశ క్వాలిటీ అధికారులు హాలియాలోని వజ్రతేజ క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ రైస్‌మిల్లును సందర్శించారు. ఇక్కడి రైతులు పండించిన 1010, 1064 రకం బియ్యాన్ని వారు పరిశీలించారు. బియ్యానికి ఉండాల్సిన పారామీటర్స్‌ను చెక్ చేసి స్వయంగా వండి రుచి, వాసనను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్కెటింగ్ జీఎం భాస్కర్‌రావు, బీజీఎం ప్రోక్యూర్‌మెంట్ రాఘవేంద్ర, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంపా నాగేందర్, క్యూసీలు సైదులు, మల్లారెడ్డి, విజయభూషన్, నల్లగొండ డీఎం హరీశ్, వజ్రతేజ డైరెక్టర్లు చిట్టిపోలు వెంకటేశ్వర్లు, కుక్కడపు రమేశ్, యశ్వంత్, రంజిత్ ఉన్నారు.

హాలియాలోని వజ్రతేజ రైస్‌మిల్లులో ధాన్యం మిల్లింగ్‌ను పరిశీలిస్తున్న ఫిలిప్పిన్స్ దేశ అధికారులు

పకడ్బందీగా రేషన్ కార్డుల సర్వే : డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నార్కట్‌పల్లి, జనవరి 18 : అర్హులను గుర్తించేందుకు రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులపై పకడ్బందీగా సర్వే నిర్వహించనున్నట్లు పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గోపలాయపల్లి గ్రామంలో కొనసాగుతున్న రేషన్ కార్డుల సర్వే ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. దరఖాస్తులను పరిశీలన, వివరాల నమోదుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఉమేశ్, సివిల్ సప్లయ్ తాసీల్దార్ దీపక్ నాయక్, ఆర్ఐ తరుణ్ ఉన్నారు.

గోపలాయపల్లిలో రేషన్ కార్డుల సర్వేను పరిశీలిస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు : ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు

కట్టంగూర్, జనవరి 18 : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై ఈ నెల 21 నుంచి 23 వరకు అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పెనుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న అయిటిపాముల, భాస్కర్లబాయి, నల్లకుంటబోళ్లు, నారెగూడెం, పిట్టంపల్లి, రామచంద్రాపురం, బొల్లేపల్లి, మల్లారం, 22న ఇస్మాయిల్‌పల్లి, మునుకుంట్ల, ముత్యాలమ్మగూడెం, పందనపల్లి, పామనుగుండ్ల, కల్మెర, కట్టంగూర్, కురుమర్తి, 23న ఈదులూరు, ఎరసానిగూడెం, చెర్వుఅన్నారం, గార్లబాయిగూడెం, పరడ, దుగినవెల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రామసభల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి : ఎంపీడీఓ విజయకుమారి

త్రిపురారం, జనవరి 18 : ఈనెల 21 నుంచి 26వరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ కునిరెడ్డి విజయకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 20వరకు మండలంలో అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. 21 నుంచి తాసీల్దార్, ఎంఈఓ, ఎంపీడీఓ, ఏఓ నాలుగు బృందాలుగా ఏర్పడి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల అదనపు వసూళ్లపై తాసీల్దార్‌కు ఫిర్యాదు

మర్రిగూడ, జనవరి 18 : మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం సిలిండర్ డెలీవరీ చేసినప్పుడు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ మండలంలోని ఖుదాభక్షిపల్లి గ్రామస్తులు శనివారం తాసీల్దార్ బక్క శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ ధర రూ.855కాగా అదనంగా రూ.65 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. యాజమాన్యంపై చర్యలు తీసుకొని అదనపు చార్జీలు వసూలు చేయకుండా నియంత్రించాలని తాసీల్దార్‌ను కోరినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిరిపంగి శ్రీనివాస్, రాజు, జంగయ్య, రామలింగాచారి ఉన్నారు.

తాసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఖుదాభక్షిపల్లి గ్రామస్తులు

మెడిసిన్ విద్యార్థులకు చేయూత

రామగిరి, జనవరి 18 : ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన చిన్న పాక రాకేశ్, రీతేశ్ ఇద్దరు అన్నదమ్ములకు కోర్సు ట్యూషన్ ఫీజు, హస్టల్ ఫీజు చెల్లించేందుకు చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన బీఆర్ అండ్ ఎన్ఎల్ఎన్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. దీనిలో భాగంగా శనివారం నల్లగొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిద్రండులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ – మంజుల దంపతుల సమక్షంలో ఆర్థిక సాయాన్ని అందించారు. ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్, నల్లగొండ ఎకానామిక్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అక్కెనపల్లి మీనయ్య, కార్యదర్శి షేక్ సుల్తానా, విశ్రాంత అధ్యాపకులు, ప్రముఖ రచయిత, కవి బైరెడ్డి కృష్ణారెడ్డి, ఫోరమ్ ప్రతినిధి నాతి గణేశ్ హాజరయ్యారు. అదే విధంగా బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు కాలేజీ బ్యాగులు అందించారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ టి.సుధారాణి, ఎన్ఆర్ఐ డాక్టర్ శ్రీనివాస్, పెరికె మధు, వీరమళ్ల శ్రీనివాస్, బాల్లూరి వెంకన్న పాల్గొన్నారు.

ట్యూషన్ ఫీజు అందిస్తున్న మీనయ్య, ఫౌండేషన్ ప్రతినిధులు

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు : ఆర్ఐ

అడవిదేవులపల్లి, జనవరి 18 : ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఆర్ఐ శ్యామ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని ముదిమాణిక్యం గ్రామ శివారులోగల సర్వే నంబర్.1లోని ప్రభుత్వ భూమిలో శనివారం కొందరు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో తాసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, ప్రొక్లెయిన్లను అక్కడి నుంచి పంపిచినట్లు తెలిపారు. మొదటి హెచ్చరికగా వదిలేస్తున్నామని మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి : ఆర్టీఓ

సూర్యాపేట టౌన్, జనవరి 18: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్టీఓ సురేశ్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రం సూర్యాపేటలోని సుధాకర్ పీవీసీ ఫ్యాక్టరీలో సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపే వ్యక్తితో పాటు పక్కన ఉన్న వ్యక్తి కూడా విధిగా సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. వాహనాలు పార్కింగ్ చేసేటప్పుడు ఇతరులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహదేవ్, ఎంవీఐ జయప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలి'

కోదాడ రూరల్, జనవరి 18: వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని రాష్ట్ర వాహన తనిఖీ కేంద్రం ఎంవీఐ ఎస్‌కే.రాజ్‌మహ్మద్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం కోదాడ ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్లకు, ప్రయాణికులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్సులు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని, మితిమీరిన వేగం ప్రాణాలకు హానీకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంవీఐ రాజ్‌మహ్మద్

చీదెళ్లలో వైద్య శిబిరం

పెన్‌పహాడ్, జనవరి 18: మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో పెన్‌పహాడ్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మంది తెమడ నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ స్రవంతి తెలిపారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి పెన్‌పహాడ్ పీహెచ్‌సీలో ఆరు నెలల పాటు ఉచితంగా వైద్యం అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నాజియా, శ్రీశైలం, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రాజు, ప్రియాంక, ప్రేమ్ కుమార్, లింగాల రాజు, రేణుక, మాధవి, మాధవరెడ్డి, ఆశ వర్కర్లు నీలావతి, నాగమణి, వనజ, లలిత, రాణి, పంచాయతీ కార్యదర్శి రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

యల్లాపురంలో..

పాలకవీడు: మండలంలోని యల్లాపురంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మందికి పైగా గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి నాగిని తెలిపారు. వైద్య సిబ్బంది విద్య, రాంబాయి, నాగమణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన జయ పాఠశాల విద్యార్థులు

సూర్యాపేట అర్బన్, జనవరి 18: హైదరాబాద్‌లోని డాక్టర్ ఏఎస్ రావు అవార్డ్స్ కౌన్సిల్ నిర్వహించిన రెండో లెవల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా కేంద్రంలోని సిటీ టాలెంట్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ ఆర్.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. విద్యార్థులు ప్రజ్ఞారెడ్డి, సాయి గోకుల్, ప్రణవి, వెంకటసాయి ప్రణవ్, దినేశ్ మల్లిక్ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీధర్ పాల్గొన్నారు.

జయ విద్యార్థులు..

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా కేంద్రం సూర్యాపేటలోని జయ పాఠశాల విద్యార్థులు కార్తికేయ, వైష్ణవి, శివవంశీ, షణ్ముక ప్రత్యయ్, నందవర్ధన్‌రెడ్డి, దేవిప్రియ, విష్ణువర్ధన్, శ్రీశ్యాస, అక్షయ్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించినట్లు కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు.

కోదాడ టౌన్: కోదాడకు చెందిన జయ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థి అక్షయ్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు.

కోదాడలో ప్రశాంతంగా ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష

కోదాడ రూరల్, జనవరి 18: కోదాడ పట్టణంలోని రెండు సెంటర్లలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 386 మంది విద్యార్థులకు గాను 342 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. కాగా, పట్టణ బాలికల ఉన్నత పాఠశాల సెంటర్‌లో ఓఎంఆర్ షీట్‌లో కొంతమంది విద్యార్థుల హాల్ టికెట్ నంబర్లను ఇన్విజిలేటర్స్ తప్పుగా దిద్దారని విద్యార్థులు ఆరోపించడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈ విషయమై నవోదయ ప్రవేశ పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ సుశీల స్పందించారు. విద్యార్థుల తల్లిదండ్రులను, పట్టణ ఎస్ఐని పిలిపించి ఎటువంటి తప్పు జరగలేదని తెలిపారు. వారికి ఓఎంఆర్ షీట్స్ చూపించారు. ఆందోళ చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

తుంగతుర్తిలో..

తుంగతుర్తి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నవోదయ పరీక్షకు 206 మంది విద్యార్థులకు గాను 153 మంది హాజరయ్యారు. నవోదయ విద్యాలయ చలకుర్తి హెచ్ఎం నాగభూషణం, ఎంఈఓ లింగయ్య పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు.

'పార్టీలకతీతంగా రేషన్ కార్డులను మంజూరు చేయాలి'

తుంగతుర్తి, జనవరి 18: పార్టీలకతీతంగా అర్హులందరికీ రేషన్ కార్డులను మంజూరు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలో తాసీల్దార్ దయానందంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, శ్రీను, నరేశ్, రఫీక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'మాల మహానాడు జాతీయ అధ్యక్షుడిపై కేసు నమోదు చేయాలి'

ఆత్మకూర్.ఎస్, జనవరి 18: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపై మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మేడి కృష్ణ అన్నారు. మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా కొట్టి చంపుతామని బెదిరింపులకు పాల్పడిన రామ్మూర్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరుతూ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకుడు మారిపెల్లి జగన్, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌ఛార్జి బత్తుల వెంకటరమణ, నాయకులు తిప్పర్తి గంగరాజు, పల్లెల రాములు, మిర్యాల చిన్ని, మేడి మహేందర్, మొలకలపల్లి నాగేందర్, కార్తీక్, మధు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

'కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి'

మేళ్లచెర్వు, జనవరి 18: సిమెంట్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్యులు జీవనం సాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్మికులు చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎల్లయ్య, జానీ పాల్గొన్నారు.